క్లుప్తంగా

ప్రారంభమైన ప్రయోగ పరీక్షలు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మంజుల వీణ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారని, మొత్తం 56 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధారణ గ్రూపులకు37 కేంద్రాలు, వృత్తి విద్యా కోర్సులకు 19 కేంద్రాలను కేటాయించామన్నారు. తొలిరోజు 2,240 మంది హాజరయ్యారని, ఈనెల 20 వరకు ప్రయోగ పరీక్షలు ఉంటాయని వివరించారు.

మక్కువలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన రంగునాయుడు

మక్కువ: మండల కేంద్రం మక్కువలో రోటరీ బ్లడ్ సెంటర్, మహాలక్ష్మి మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 24 మంది యువకులు రక్తదానం చేశారు. మెడికల్ షాప్ నిర్వాహకుడు పకీరురాజు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ బడ్నాన ప్రమీల

పాచిపెంట: మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ బడ్నాన ప్రమీల ఆదివారం భూమిపూజ చేశారు. రూ.4 కోట్లతో పి.కోనవలస నుంచి మాతుమూరు వరకు రోడ్డు నిర్మాణం జరగనుందని, ఈ నేపథ్యంలో భూమి పూజచేసినట్లు ఎంపీపీ తెలిపారు. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర కృషితో ఈ రోడ్డు నిర్మాణం సాధ్యమవుతోందన్నారు. ఎంపీటీసీ ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోలబాబ్జీ, నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



వైద్య సేవలందిస్తున్న డీఎంఓ జగన్‌మోహనరావు

సీతానగరం: అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక వైద్యం అందజేయడానికి ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఓ డాక్టర్ టి జగన్‌మోహనరావు సూచించారు. ఈ మేరకు సీతానగరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆదివారం ఆయన సందర్శించి ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చిన వారికి వైద్య సేవలందించారు. అనంతరం పీహెచ్‌సీలో ఉంచిన మందులు, వైద్యసేవల కోసం వచ్చిన రోగుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురై వైద్య సేవల కోసం వచ్చిన వారినుంచి వ్యాధి లక్షణాలు, ఇంతకు ముందు ఏమైనా మందులు వాడారా? తదితర అంశాలను అడిగి తెలుసుకున్న తరువాత వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధినివారణకు మందులు ఇవ్వాలని సూచించారు. ప్రధాన రహదారిని అనుకుని పీహెచ్‌సీ ఉన్నందున ఉన్నతాధికారుల తాకిడి ఉంటుందని, అత్యవసర వైద్య సేవల కోసం ఎక్కువగా వస్తుంటారని తెలియజేశారు. ఈ మేరకు పీహెచ్‌సీలో అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో నేత్ర వైద్య సేవలపై సమీక్ష

పార్వతీపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 2వ తేదీ నుంచి జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నిర్వహిస్తున్న నేత్ర పరీక్షలపై నేత్ర వైద్యాధికారులు, నేత్ర వైద్య సహాయకులతో జిల్లా అంధత్వ నివారణాధికారి డా.సుకుమార్ బాబు ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్‌కి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసి నేత్ర పరీక్షలు నిర్వహించాలన్నారు. గతంలో పాఠశాలల్లో కంటి తనిఖీలు చేసిన వారిలో దృష్టి దోషం ఉన్న విద్యార్థులకు, ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేత్ర పరీక్షలు చేసిన వారికి కళ్ల జోళ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు చేసిన వారి వివరాలు సురక్ష పోర్టల్‌లో ఎలా పొందు పరచాలో, ఇంకా 585 మందికి జిల్లా వ్యాప్తంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళిక వివరించారు. ఇప్పటికే 9150 మందికి కళ్ల జోళ్లు, 500 మందికి శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి డా. జీరు నగేష్ రెడ్డి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి శస్త్ర చికిత్స నిపుణుడు డా.సుకుమార్ బాబు, నేత్ర వైద్య సిబ్బంది, జిల్లా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంలో ప్రగతి పవనాలు

- పూర్తయిన బైపాస్ రోడ్డు నిర్మాణం
- వరహాలగెడ్డకు మహర్దశ
- ఫ్లై ఓవర్‌పై విద్యుత్ దీపాలు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- రూ.10 కోట్లతో రోడ్ల నిర్మాణం

పార్వతీపురంటౌన్:

ఒకప్పుడు పార్వతీపురం అంటే అందరికీ చులకనే. కొందరు సినీ రచయితలు సైతం తమ సినిమా పాటల్లో 'బతుకు పార్వతీపురం బస్టాండే' అనే పదాలు వాడేవారు. గత పాలకుల నిర్లక్ష్యం, సరైన నాయకుడు లేక అభివృద్ధికి కాస్త దూరంగా పార్వతీపురం ఉండేది. ఇక్కడి బైపాస్ రోడ్డును నరకానికి దారిగా పేర్కొనేవారు. పూడికలు, వ్యర్థాలతో పేరుకుపోయిన మురుగు కాలువలా వరహాల గెడ్డ కనిపించేది. వర్షాకాలంలో గెడ్డ పొంగి పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లను ముంచెత్తేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్వతీపురం పట్టణాభివృద్ధిపై దృష్టిసారించి రూపురేఖలను మార్చింది. ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషితో పార్వతీపురంలో ప్రగతి పవనాలు వీస్తున్నాయి. పట్టణ ప్రజల కోరిక మేరకు రూ.1.90 కోట్లతో బైపాస్ రోడ్డును నిర్మించారు. వరహాలగెడ్డలో పూడికలు తొలగించారు. ముంపు కష్టాలను తీర్చారు. బైపాస్ రోడ్డులో విద్యుత్ దీపాలు వేయించి రాత్రివేళ ప్రయాణించేవారికి వెలుగులు ప్రసరింపజేశారు. మరోవైపు అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారు.



ఫ్లై ఓవర్‌పై విద్యుత్ దీపాలు



బైపాస్ రోడ్డు



పూడికలు తీసిన వరహాలగెడ్డ

రూ. 10 కోట్లతో రోడ్ల నిర్మాణం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో రోడ్లు, డ్రైన్‌ల అభివృద్ధికి రూ. 10కోట్లు ఖర్చు చేశారు. పట్టణంలోని చిన దేవరవీధి, నందమూరి కాలనీ, గంటా వీధి, మేదర వీధి, గాంధీ సత్రంవీధి, తాళాబత్తుల వీధి, రెడ్డి వీధి, లింగంవీధి, కుసుమగుడి వీధి, గులిపిల్లివీధి, రామాపురం కాలనీ, వివేకానంద కాలనీ, ఎస్ఎన్‌పీ కాలనీ, జనశక్తి కాలనీ, బంగారమ్మకాలనీలలో ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించి రోడ్ల నిర్మాణాలను పూర్తి చేశారు.

రాత్రిపూట భయపడేవాళ్లం



పట్టణం నుంచి కొత్తవలసకు రాత్రివేళల్లో బైపాస్ గుండా హైవేపై వెళ్లేందుకు భయపడేవారం. చీకట్లో ప్రయాణించాల్సి వచ్చేది. ప్రభుత్వం నూతన రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో పాటు ఫ్లై ఓవర్‌పై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి ప్రమాదాలను దూరం చేసింది. రాత్రివేళలో ప్రయాణించేవారికి భయాన్ని దూరం చేసింది.

–గులిపిల్లి మాధవ్, పార్వతీపురం పట్టణం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఒకప్పుడు పట్టణంలో ఆటో నడపాలంటే నరక యాతన అనుభవించే వారం. రోడ్డుపై ఆటో నడుపుతుంటే ప్రతి నెల రోజులకోసారి రోడ్డు బాగోలేక ఆటోలు రిపేర్లకు వచ్చేవి. జగనన్న ప్రభుత్వం వచ్చాక పట్టణంలోని రోడ్లకు మహర్దశ వచ్చింది. అభివృద్ధి పనులు సాగుతున్నాయి. లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా పథకాల ఆర్థిక సాయం జమ అవుతోంది. ప్రభుత్వానికి, జగనన్నకు రుణపడి ఉంటాం.

– బత్తుల కృపారావు, ఆటో డ్రైవర్, పార్వతీపురం

పార్వతీపురంలో సంక్షేమ పథకాల లబ్ధి ఇలా	
వివరాలు	సంఖ్య
జనాభా	54070
వార్డులు	30
సచివాలయాలు	15
సచివాలయ సిబ్బంది	120మంది
వలంటీర్లు	272 మంది
వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు	4,972 మంది
రైస్ కార్డులు	12,460
కాపు నేస్తం	90 మంది
టైలర్లు	281 మంది
నాయీ బ్రాహ్మణులు	59 మంది
లబ్ధిపొందిన రజకులు	59 మంది
వైఎస్సార్‌చేయూత	1823 మంది
విద్యార్థుల స్కాలర్‌షిప్	1237 మంది
పాస్టర్లు, అర్చకులు	30 మంది

మున్సిపాల్టీని అన్ని విధాలా అభివృద్ధి చేశాం



పార్వతీపురం మున్సిపాల్టీని అన్ని విధాలా అభివృద్ధి చేశాం. గడపగడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా రూ. 10కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణం పూర్తిచేశాం. గత ప్రభుత్వంలో గాలికొదిలేసిన బైపాస్ రహదారిని రూ. 1.90 కోట్లతో పూర్తి చేశాం. ఒక పక్క అభివృద్ధి, మరో పక్క ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేసింది. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది

– అలజంగి జోగారావు, ఎమ్మెల్యే, పార్వతీపురం

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే

- బూత్‌స్థాయిలో అలసత్వం వద్దు
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటూ కీలకమేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురం మండలం, జమ్మడవలస పంచాయతీ పరిధిలో గల 102, 103, 104 పోలింగ్ బూత్‌ల పరిధిలోని గ్రామాలు జమ్మడవలస, వీరభద్రపురం, అంటివలసలలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలు మనందరికీ చాలా కీలకం కానున్నాయని, ఈ ఐదేళ్ల సుపరిపాలనలో సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమం, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరాయన్నారు. ఇదేవిధంగా భవిష్యత్‌లో కూడా కొనసాగాలంటే మళ్లీ మన జగనన్న ప్రభుత్వం వచ్చి తీరాలని అందుకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటు కూడా కీలకం కానుంది కావున ఎక్కడా అలసత్వంగా ఉండకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్క పోలింగ్ బూత్ స్థాయిలో మన వారంతా ప్రజలతో మమేకమై పార్టీతో అనుసంధానం చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచేలా చూడాలని, అందుకు మీరంతా నిరంతరంగా గ్రామాల్లో ప్రజలతో మమేకమై ఉండాలని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, స్థానిక సర్పంచ్‌లు యాళ్ల ఈశ్వర ప్రతాప్, గొర్లి రాజు, పార్టీ జనరల్ సెక్రెటరీ వి.గురురాజు, స్థానిక నాయకులు గునుపూరు నల్లం నాయుడు, దత్త సద్గురు, కర్రి సింహాచలం, త్రినాథ, అల్లు అప్పలనాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వీరభద్రపురం గ్రామంలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బూత్ స్థాయి కమిటీ సమావేశంలో దిశా నిర్దేశం

పార్వతీపురం నియోజకవర్గంలో గల 233 పోలింగ్ బూత్‌లలో పూర్తిస్థాయి కమిటీలు ఏర్పాటు చేయడమే కాకుండా ఎన్నికల నిర్వహణపై తీవ్ర కసరత్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పార్వతీపురం పురపాలక సంఘంలోని దేవాంగుల ప్రాంతం 16వ పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఎమ్మెల్యే జోగారావు సమావేశం ఏర్పాటు చేశారు. బూత్‌ల వారీగా కమిటీలు ఏర్పాటు చేసే అంశంపై సవివరంగా తెలియజేసి భవిష్యత్తులో వారు ఏమేమి చేయాలన్న అంశంపై స్పష్టతనిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జీసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక వార్డు కౌన్సిలర్ తాడ్డి శంకరరావు, గెంబలి బాలమురళీకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం

సీతానగరం: మండలంలోని వెన్నెలబుచ్చింపేట, వెంకటాపురం గ్రామాల ప్రజలు రహదారి కోసం దశాబ్దాలుగా కన్నకలలు జగనన్న ప్రభుత్వం ద్వారా నెరవేరనుందని డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, సర్పంచ్ తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు వెన్నెలబుచ్చింపేట వద్ద జరుగుతున్న రోడ్డు పనులను ఇంజినీరింగ్ సహాయకులు, మాజీ సర్పంచ్ మహేశ్వరరావు, వి దానబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రహదారిని అనుకుని ఉన్న అంటిపేట జంక్షన్ నుంచి వెంకటాపురం, వెన్నెలబుచ్చింపేట, బొబ్బిలి మండలంలోని కోమటిపల్లి, కోట సీరాంపురం గ్రామాలకు అనుసంధానంగా ఉన్న గ్రామాలకు రాకపోకలకు రహదారి సౌకర్యం లేక వేలాది మంది ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, రహదారి సౌకర్యం కల్పించాలని దశాబ్దాల కాలంగా పాలకుల ముందు మొరపెట్టున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ఈ నేపథ్యంలోనే జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం అంటిపేట, వెంకటాపురం, వెన్నెలబుచ్చింపేట గ్రామాలకు వెళ్లి సమస్యలు అడిగిన సమయంలో రోడ్డులేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో బీటీరోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ విషయమై సంబంధిత ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా ఇప్పటివరకూ రోడ్డు వైడెనింగ్, అభివృద్ధి పనులు పూర్తి కావచ్చాయని, త్వరలో బీటీ వేసి పూర్తిచేయనున్నట్లు తెలిపారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ తిరుపతిరావు, ప్రజా ప్రతినిధులు

మున్సిపాలిటీలో గ్రామాల విలీనం లేదు

- ప్రజల ఆందోళన అనవసరం

సాలూరు: సాలూరు మున్సిపాలిటీలో చుట్టుపక్కల పంచాయతీలైన జీగిరాం, నెలివర్తి, కూర్మరాజుపేట విలీనం కావని, ప్రజలు దీనిపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సూరప్పనాయుడు, వేణు తదితరులు అన్నారు. ఈ మేరకు ఆదివారం సాలూరు పట్టణంలోని ఉపముఖ్యమంత్రి రాజన్నదొర కార్యాలయం ఆవరణలో విలేకరులతో వారు మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ పాలనలో ఈ పంచాయతీ గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం చేయడానికి నిర్ణయించి తెరతీశారని, అయితే నాడు ఈ పంచాయతీ ప్రజల అభిప్రాయం మేరకు నాటి ఎమ్మెల్యే, నేటి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ఈ ప్రతిపాదనను నిలుపుదల చేయించారని గుర్తుచేశారు. 2014వ సంవత్సరంలో సాలూరు గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా చేయడానికి హద్దులు అడిగారని, మున్సిపాలిటీలో గ్రామాల విలీనానికి ప్రభుత్వం జీఓలేమీ జారీ చేయలేదని స్పష్టం చేశారు. మండల తీర్మానం, పంచాయతీ తీర్మానాలు లేకుండా విలీనం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు కొందరు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు.



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరులో త్వరలో మహిళామార్ట్ ప్రారంభం

సాలూరు: పట్టణంలో మహిళామార్ట్ త్వరలో ప్రారంభం కానుంది. మెప్మా ఆధ్వర్యంలో సాలూరు మెయిన్‌రోడ్డు సెంటర్ పెదబజార్ సమీపంలో పాతబస్టాండ్ వద్ద ఈ మార్ట్ ప్రారంభించనున్నారు. దీనిపై మెప్మా సీఎంఎం పుష్ప మాట్లాడుతూ, పట్టణంలోని 1264 సంఘాలు, 13,400మంది సభ్యులతో ఈ మహిళా మార్టును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో సుమారు రూ.18 లక్షల 93 వేలతో ఈ మార్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ఈ మార్ట్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

- రూరల్ సీఐ రవికుమార్

పార్వతీపురంటౌన్: ఏఓబీ గ్రామాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని పార్వతీపురం రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏఓబీ గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్వతీపురం సర్కిల్ పరిధిలో ఎక్కువగా ఒడిశా సరిహద్దు గ్రామాలున్నందున ఆ రాష్ట్రం నుంచి మద్యం, సారా, మాదక ద్రవ్యాలు గతంలో రవాణా జరిగాయన్నారు. ప్రస్తుతం ఆ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి సిబ్బందితో నిరంతర నిఘా పెట్టి అక్రమార్కుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ పరిధిలో ఇటువంటి కార్యకలాపాలు గమనిస్తే తక్షణమే పోలీసు సిబ్బందికి సమాచారం అందజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

సీతానగరం: మండల తహసీల్దార్ జి.వెంకట జనార్దన్ ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలోని మండల తహసీల్దార్‌లను, ఇతర అనుబంధ శాఖల్లో పని చేస్తున్న తహసీల్దార్ స్థాయి కేడర్ అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ ఎన్వీ రమణకు విశాఖపట్నంలోని మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో జి.వెంకటజనార్దన్ బాధ్యతలు చేపట్టారు. ఆయన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలిశారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలుసుకున్న తహసీల్దార్ వెంకటజనార్దన్

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

సాలూరు: సక్రమంగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని ప్రముఖ వైద్యుడు వాడాడ గణేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన సాలూరు పట్టణంలోని వైటీసీలో గల గిరిశిఖర గర్భిణుల వసతి గృహంలో మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్, గౌరమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గర్భిణులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండాలని తద్వారా పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులకు పండ్లు తదితర పౌష్టికాహారాన్ని అందించారు. ఈ వసతిగృహ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డా.ఆరిశెట్టి ఇందుమణి, అక్కేన కృష్ణరాధా, కె.అరుణకుమారి, కుమార్, దిలీప్, కామేశ్వరి, హేమలత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గతల్లి గుడి ప్రతిష్ట

సీతానగరం: మండలంలోని నీలకంఠాపురంలో ఉరిటి కుటుంబీకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు నూతనంగా నిర్మించిన దుర్గగుడిలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ఆదివారం ఘనంగా జరిగింది. ఉరిటి కుటుంబీకుల ఇలవేల్పు అయిన దుర్గతల్లి గుడి కట్టించాలని నిర్ణయించిన అనతి కాలంలో నిర్మాణం పూర్తిచేయడంతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను పురస్కరించుకుని పలుగ్రామాల నుంచి చీరలు, పసుపు, కుంకుమ, గాజులు, పూజాద్రవ్యాలతో భక్తులందరూ వచ్చి దేవిని పూజించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆర్.రాము, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వై.గోపాలనాయుడు, ఉరిటి కుటుంబీకులు పాల్గొన్నారు.

ఘంటసాలకు నివాళులు

సాలూరు: సుప్రసిద్ధ సినీ సంగీత మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరావు వర్ధంతిని ఆదివారం సాలూరు పట్టణంలో నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. కబీర్ షా అండ్ పార్టీ ఆర్కెస్ట్రా సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా, కొంకివీధి సమీపంలో ఘంటసాల విగ్రహానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జర్జాపు సూరిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘంటసాల సినీ జగత్‌కు అందించిన సేవలను, ఆయన పాడిన పాటలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు రామప్రసాద్, బాషా, దుర్గాప్రసాద్, రాజాబాయ్, చందు మాస్టర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లికేషన్

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జికోర్టు వారి కోర్టు లో
I.P. 14/2023

పిటీషన్:
కలగర్ల దినేష్, తండ్రి వాసుదేవరావు, వయస్సు 32 సంవత్సరాలు, డోర్ నెం. 5-11, కొత్తపేట వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా-535591. --- పిటీషనర్

అండ్:
1) కోరాడ ధనోజ్ కుమార్, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 35 సంవత్సరాలు, వ్యాపారం, కామాక్షి దేవాలయం దగ్గర, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా - 535591.
2) యెనపర్తి సాయి, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 40 సంవత్సరాలు, వ్యాపారం, 2వ అంతస్తు, ఎదురొముకులు వర్మ అపార్ట్‌మెంట్, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా- 535591.
3) గేదెల గంగారావు, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 34 సంవత్సరాలు, వ్యాపారం, ఆంజనేయస్వామి విగ్రహం దగ్గర, కోటిని వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా-535591.
4) బుడి శశికుమార్, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 35 సంవత్సరాలు, వ్యాపారం, దచ్చి వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా-535591.
5) సిరిపురపు హేమంత్ @ చంటి, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 28 సంవత్సరాలు, వ్యాపారం, వాటర్ ప్లాంట్, దచ్చి వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా-535591.
6) కెల్లా బాలాజీ, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 28 సంవత్సరాలు, వ్యాపారం, రామ మందిరం దగ్గర, దచ్చి వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా-535591.
7) బొడ్డు నారాయణరావు, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 40 సంవత్సరాలు, వ్యాపారం, ఇర్వన స్ట్రీట్, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా-535591.
8) కరిమజ్జి శంకరరావు, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 45 సంవత్సరాలు, వ్యాపారం, మెంటాడ వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా-535591.
9) భోగి జగదీష్, తండ్రి అనంత్, వయస్సు సుమారు 35 సంవత్సరాలు, వ్యాపారం, కొటికి వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా-535591.
10) తలాడ సుధీర్‌కుమార్, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 40 సంవత్సరాలు, వ్యాపారం, చిట్లు వీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా-535591.
11) వికాస్ రెడీమేడ్ & హోసరీ, రిప్రజెంటింగ్ బై ఇట్స్ ప్రొప్రైటర్, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 60 సంవత్సరాలు, వ్యాపారం, షాప్ నెం. 7, 8, 9, 10, బాలాజీ మార్కెట్, విజయనగరం-535002.
12) శ్రీ మహావిష్ణు రెడీమేడ్స్, రిప్రజెంటింగ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ పూసర్ల శ్రీనివాసరావు, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 38 సంవత్సరాలు, వ్యాపారం, షాప్ నెం. 101, 20, 301, వెంకటేశ్వర క్లాత్ కాంప్లెక్స్, విజయనగరం-535002.
13) కుసుమంచి, రిప్రజెంటింగ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ కుసుమంచి సూర్యారావు, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 55 సంవత్సరాలు, వ్యాపారం, బాలాజీ మార్కెట్, విజయనగరం-535003.
14) S.V.G.L. యూనిక్ కలెక్షన్స్, రిప్రజెంటింగ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ శ్రీకాంత్, తండ్రి నాట్‌నోన్, వయస్సు సుమారు 38 సంవత్సరాలు, వ్యాపారం, D.No. 26-8-78/A, వందంపుల్లల వీధి, విశాఖపట్నం-530001.
----- రెస్పాండెంట్లు నెం. 1 to 14

పైన పేర్కొనబడిన పిటిషనర్, పై కోర్టు వారి దివాలా కోరు వాజ్యం నెం. 14/2023 పైన పేర్కొనబడిన రెస్పాండెంట్లు పైన దాఖలా చేయగా తేది. 20-02-2024 వాయిదా వేసి యున్నారు. కావున సదరు వాజ్యంపై పైన పేర్కొనబడిన రెస్పాండెంట్లునేకాక ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల తేది. 20-02-2024 ఉదయం 10.30 గం.లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై తమ యొక్క అభ్యంతరములు తెలియజేసుకొనవలసినదిగా ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియచేయడమైనది.
(పై కోర్టు వారి ఆదేశానుసారము ఈ ప్రకటన జారీ చేయడమైనది.)

పూసర్ల సురేష్ కుమార్, న్యాయవాది
6-116, టౌన్ పోలీస్‌స్టేషన్ వీధి, పార్వతీపురం, సెల్: 9845875113